క్లుప్తంగా

పరిశుద్ధ ఆరోగ్యమాతకు గ్రామోత్సవం



పరిశుద్ధ ఆరోగ్యమాత మహోత్సవాల్లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పీ.డేవిడ్, ఎం.రాజు

దెందులూరు: దోసపాడు పరిశుద్ధ ఆరోగ్య మాత మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. పోతునూరు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ పీ.డేవిడ్ ఆధ్వర్యంలో ఉత్సవాల్లో ఫాదర్లు ఎం.రాజు,ఫాదర్ ఇంజమాల్, సమిష్టి దివ్యపూజా బలి అర్పించారు. ఆరోగ్యమాత ప్రతిమతో గ్రామంలో అన్ని వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. తొలుత దోసపాడు నాయక బృందం మేరీమాత గాయక బృందం, చర్చిలో ప్రత్యేక పాటలతో భక్తులను అలరించారు. ఈ సందర్భంగా ఫాదర్ పీ.డేవిడ్ బైబిల్ సందేశాన్ని విశ్వాసులకు వివరించారు. అందరూ ఆధ్యాత్మిక జీవనం గడపటం మేరీమాతకు ఇష్టమని ఆయన అన్నారు. ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీ

పెదవేగి : విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటల్లోనూ రాణించాలని సచివాలయ కార్యదర్శి పి విజయ రాజేష్ అన్నారు. పెదవేగి మండలం అమ్మపాలెంలోని ఎంపీ యూపీ స్కూల్లో 100 మంది బాల బాలికలకు చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్ క్రాఫ్ట్ వారి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ అధ్యక్షతన ఎంపీయూపీ స్కూల్ హెచ్ఎం సహకారంతో బాలమేళా అనే ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం తోట సుజాత, ఉపాధ్యాయులు క్రాఫ్ జిల్లా కోఆర్డినేటర్ ఎస్ రవిబాబు, సిబ్బంది ఎస్ రాఖీ, సౌజన్య పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

భీమడోలు: దేవదాయ ధర్మదాయ శాఖ పరిధిలోని గుండుగొలను వేంకటేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి నియామకానికి నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఈవో కేఎం వంశీ సోమవారం తెలిపారు. నూతన ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈనెల 18వ తేదీలోగా ధరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఏడుగురు సభ్యుల కమిటీలో నలుగురు మహిళలు ఉంటారన్నారు.

అక్కాచెల్లెమ్మలకు ఆర్థిక 'ఆసరా'

- సంక్షేమ పథకాల అమలుతో పేదల జీవితాల్లో వెలుగు
- వైఎస్సార్ సీపీకి ఓటు వేసి ఘన విజయం అందించాలి
- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు



పూళ్లలో ఆసరా సంబరాల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

భీమడోలు: పేదల జీవితాలను వెలుగులు నింపాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం. కుల, మత, రాజకీయాలకుతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నాం. మరో రెండు నెలల్లో ఎన్నికల వస్తున్నాయి. సంక్షేమ పాలనలో పథకాలన్నీ కొనసాగి మనందరికీ మంచి జరగాలంటే మళీకల ముఖ్యమంత్రిగా జగనన్నను గెలిపించుకోవాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. పూళ్ల ఉన్నత పాఠశాలలో సోమవారం సాయంత్రం నాల్గో విడత ఆసరా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్ అధ్యక్షత వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు వాసుబాబుకు ఘన స్వాగతం పలికారు. మహిళా ప్రజాప్రతినిధులు జ్యోతిప్రజ్వలన చేశారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చారన్నారు. విపక్షకు తావివ్వకుండా పారదర్శకంగా పథకాలన్నింటినీ ఇంటింటికీ అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గతంలో చంద్రబాబు డ్వాక్రా మహిళలు, రైతు రుణమాఫీ చేస్తానని నమ్మించి అధికారంలోకి వచ్చి, ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని అన్నారు. తాను ఇచ్చిన 600 హామీలను ఆయన బుట్టదాఖలు చేసి చరిత్రహీనుడుగా మిగిలిపోయాడన్నారు. సీఎం జగన్ డ్వాక్రా అక్కా చెల్లెమ్మలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఏటా రూ.6,500 కోట్ల రుణ మాఫీ చేసి నాలుగు విడతలుగా రూ.26 వేల కోట్లు మాఫీ చేసి వారికి కుటుంబాలకు ఆసరాగా నిలిచారన్నారు. నవరత్న పథకాలను నూరుశాతం అమలు చేసిన ఏకైక సీఎంగా వైఎస్ జగన్ చరిత్ర సృష్టించారని అన్నారు. దెందులూరులో సిద్ధం బహిరంగ సభ విజయవంతమైందని, దీనితో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో ఫుల్ జోష్‌ను నింపిందన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల గెలుపునకు రెండు బటన్లు నొక్కాలని కోరారు. రాష్ట్ర చరిత్రలో 124 సార్లు బటన్ నొక్కి రూ.2.5లక్షల కోట్ల నగదును లబ్ధిదారుల ఖాతాల్లో డీబీటీ, నాన్ డీబీటీ రూపంలో జమ చేశారన్నారు. విద్య వ్యవస్థకు రూ.67వేల కోట్లు వెచ్చించి అభివృద్ధి చేశారన్నారు. ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.50వేల నుంచి రూ.60వేల వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఖర్చు చేస్తోందని అన్నారు. సర్కారీ బడుల్లోని చిన్నారులకు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా విద్యను అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో కుటుంబానికి వెచ్చించే వైద్యం కోసం రూ.25లక్షల వరకు పెంచిందన్నారు. ఆరోగ్యాంధ్ర ప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్రంలోని 17 మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేసిందని, తద్వారా ఏటా రాష్ట్రంలో 2,550 మంది డాక్టర్లు తయారు అవుతారన్నారు. భీమడోలు మండలంలో నాలుగు విడతలుగా రూ.50,46,08,247 ఆసరా నగదును అందించామని, నాల్గవ విడతగా రూ.13కోట్ల నిధులను వారి ఖాతాల్లో జమ చేస్తున్నామన్నారు. పూళ్లలో పూళ్ల, ఎంఎంపురం, కోడూరుపాడు, దుద్దేపూడి, కురెళ్లగూడెం గ్రామాల్లోకి చెందిన డ్వాక్రా సంఘాల మహిళలకు మెగా చెక్కును వారికి ఆయన అందించారు. తొలుత జగనన్న చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం చేసారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కనమాల రామయ్య, ఎంపీడీవో టి.స్వర్ణలత, ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమ, డీసీసీబీ డైరెక్టర్ కందులపాటి రాజీలు, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, జిల్లా కార్యవర్గ సభ్యుడు తుమ్మగుంట రంగ, సర్పంచులు మానుకొండ నాగేశ్వరరావు, భలే రాంబాబు, ఎంపీటీసీలు గొండు కృష్ణచైతన్య, గంటా శ్రీనివాస్, ఆజామ్, ఏఎంసీ వైస్ చైర్మన్ పులిచర్ల వెంకటకృష్ణారావు, మండల సాగు సలహా మండలి చైర్మన్ పసుపులేటి సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, నాయకులు కందులపాటి ఐబాబు, పచ్చా బాబి, పుప్పాల బుజ్జులు, బొల్లారపు పవన్, ఎండా రవి, ముదుండి సూర్యనారాయణరాజు, యాసా వెంకట్రామయ్య, సిద్దాబత్తుల పరమేశ్వరరావు, బాబి, ఏసుబాబు, ఏపీఎం సీహెచ్ సురేష్‌కుమార్, మహిళలు పాల్గొన్నారు.

ట్రై సైకిల్ అందజేత



దివ్యాంగుడికి ట్రైసైకిల్‌ను అందజేసిన దృశ్యం

ఏలూరు(మెట్రో): జగనన్నకు చెబుదాం – స్పందన కార్యక్రమంలో సోమవారం ఉంగుటూరు మండలం కొక్కరమూడి గ్రామానికి చెందిన దివ్యాంగుడు యడవల్లి ఏడుకొండలు తనకు ట్రై సైకిల్ ఇప్పించాలని జిల్లా కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాలతో జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారిణి పి.రాకాడ మహిని ట్రై సైకిల్‌ను స్పందన కార్యక్రమానికి తెప్పించారు. ట్రై సైకిల్‌ను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణితో ఏడుకొండలుకు అందజేశారు. ఈ సందర్భంగా ఏడుకొండలు మాట్లాడుతూ ఎన్నోఏళ్లుగా ట్రై సైకిల్ లేక ప్రయాణానికి ఎన్నో వ్యయప్రయాసాలకు గురయ్యానని, జగనన్నకు చెబుదాం – స్పందన కార్యక్రమం ద్వారా తనకు ట్రై సైకిల్ తక్షణమే అందించడం పట్ల జిల్లా కలెక్టర్‌కు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపి, సంతోషం వ్యక్తం చేశాడు.

సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా సుబ్బరాజు బాధ్యతల స్వీకరణ



గుండుగొలనులో సొసైటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న నంద్యాల సుబ్బరాజు

భీమడోలు: గుండుగొలను కోఆపరేటివ్ సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా నంద్యాల సుబ్బరాజు సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం నుంచి ప్రత్యేక జీవో అధికారికంగా జారీ అయ్యింది. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు నంద్యాల సుబ్బరాజు త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా నంద్యాల సుబ్బరాజు, సభ్యులుగా గుండుగొలనుకు చెందిన మద్రాపు నాగేంద్రబాబు, ఆగడాలలంకకు చెందిన భలే విష్ణు నారాయణ నియమితులయ్యారు. ఆరు నెలలుగా సొసైటీ చైర్మన్ పదవిపై వివాదాలు నెలకొనడంతో కోర్టులను ఆశ్రయించారు. దీంతో కొత్త కమిటీ నియామకంలో జాప్యం జరిగింది. ఎట్టకేలకు ప్రభుత్వం నుంచి ప్రత్యేక జీవో జారీ కావడంతో త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా నంద్యాల సుబ్బరాజు ప్రత్యేక అధికారి ఎం.నరసింహరాజు నుంచి బాధ్యతలను స్వీకరించారు. సొసైటీ త్రిసభ్య కమిటీ నియామకానికి ఎమ్మెల్యే వాసుబాబు ప్రత్యేక శ్రద్ధ కనబర్చడంతో మార్గం సుగమం అయ్యింది. ఉప సర్పంచ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు ముదుండి సూర్యనారాయణరాజు, జిల్లా నాయకులు వగ్వాల అచ్యుతరామారావు, గొటికల మురళీ, నల్ల శ్రీను, వేములమంద రామరాజు, డోకల మురళీ నూతన కమిటీ సభ్యులను అభినందించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఉంగుటూరు: దివంగత ఎమ్మెల్సీ సాబ్జీ పేరున ముద్రించిన క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఉంగుటూరు మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసరావు, యూటీఫ్ నాయకులు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. మండల యూటీఎఫ్ అధ్యక్షుడు వునుముల రాంబాబు, ప్రధాన కార్యదర్శి డాకి జోగినాయుడు ఆధ్వర్యం వహించారు. గౌరవ అధ్యక్షుడు శీతాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగప్రాప్తిరస్తు

- ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వ ప్రాధాన్యం
- నైపుణ్యాలకు పదును
- జాబ్‌మేళాల ద్వారా అవకాశాలు
- 4,572 మందికి ఉద్యోగాలు



జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులు (ఫైల్)

జాబ్ మేళాలు.. ఉద్యోగాలు పొందిన వారి వివరాలు

పశ్చిమగోదావరి జిల్లా: నియోజకవర్గం	హాజరైన వారు	ఎంపికైన వారు	ఏలూరు జిల్లా: నియోజకవర్గం	హాజరైన వారు	ఎంపికైన వారు
నరసాపురం	886	297	నూజివీడు	703	258
తాడేపల్లిగూడెం	1,828	595	ఏలూరు	2,126	539
భీమవరం	2,676	569	పోలవరం	646	187
ఆచంట	812	254	చింతలపూడి	645	276
ఉండి	457	195	ఉంగుటూరు	400	125
పాలకొల్లు	492	214	దెందులూరు	3,100	581
తణుకు	790	257	కైకలూరు	772	225

ఆకివీడు: నైపుణ్యంపైనే ఉద్యోగావకాశాలు ఆధారపడి ఉంటాయి. సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతున్న రోజుల్లో నైపుణ్యాల పాత్ర కీలకంగా మారింది. ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగావకాశాలకు నైపుణ్యాలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నిరుద్యోగుల నైపుణ్యాలకు పదునుపెట్టి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంది. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా స్కిల్‌హబ్‌లు ఏర్పాటుచేసి పలు రంగాల్లో యువతకు శిక్షణ ఇస్తోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ముమ్మరంగా జాబ్‌మేళాలు ఏర్పాటుచేసి బాసటగా నిలుస్తోంది. జాబ్‌మేళాలకు నిరుద్యోగులు ఉత్సాహంగా హాజరవుతున్నారు. ఆయా కంపెనీలు నిర్వహించే ఇంటర్వ్యూలలో పాల్గొని ఉద్యోగాన్ని సంపాదిస్తున్నారు.

16,333 మంది హాజరు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఇప్పటివరకు ప్రభుత్వం నిర్వహించిన జాబ్‌మేళా కార్యక్రమాల్లో 16,333 మంది నిరుద్యోగులు పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ చాటిన 4,572 మందికి ఉద్యోగాలు వచ్చాయి. అలాగే క్యాంపస్ సెలెక్షన్స్‌లో మరో 1,361 మందికి పైగా విద్యార్థులు కొలువులు సాధించారు.

స్కిల్ హబ్‌లతో ఉపాధి, ఉద్యోగం

ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా స్కిల్ హబ్‌లను ఏర్పాటుచేసి యువతకు సాంకేతిక రంగంలో శిక్షణ ఇస్తోంది. నియోజకవర్గానికి ఒకటి చొప్పున పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో 1 హబ్‌లను ఏర్పాటుచేసి ఎలక్ట్రానిక్, ఏసీ మెకానిజం, జూనియర్ సాఫ్ట్‌వేర్, టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ ఇస్తోంది. ఏడాది కాలంగా ఆయా హబ్‌ల ద్వారా సుమారు 2,400 మంది పలు కోర్సుల్లో శిక్షణ పొందగా.. పలువురికి ఉద్యోగావకాశాలు కూడా కల్పించింది.

స్కిల్‌ను కిల్ చేసిన చంద్రబాబు

స్కిల్ డెవలప్‌మెంట్‌ను గత చంద్రబాబు ప్రభుత్వం తుంగలో తొక్కింది. నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలను దూరంచేసింది. జాబ్ మేళాల ఊసెత్తలేదు. దీంతో అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డాయి. సీఎం జగన్ అధికారం చేపట్టినప్పటినుంచి జాబ్‌మేళాలు, క్యాంపస్‌సెలెక్షన్స్ ద్వారా యువతకు ప్రైవేట్ సెక్టార్‌లో ఉద్యోగాలు కల్పిస్తున్నారు.

ముమ్మరంగా అభివృద్ధి పనులు



అసెంబ్లీ వద్ద సీఎం జగన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: ఉంగుటూరు నియోజకవర్గంలో పలు రోడ్లు, విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఎమ్మెల్యే వాసుబాబు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం అసెంబ్లీ ఆవరణలో ఆయన ముఖ్యమంత్రిని కలిసి నియోజకవర్గంలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయగా, నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని ఆయన వివరించారు. బువ్వనపల్లి, అడవికొలను, అర్ధవరం, చేబ్రోలు, దూబచర్ల తదితర గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారుల నిర్మాణానికి ఇటీవల సుమారు పది కోట్ల రూపాయల వరకూ నిధులు మంజూరయ్యాయి. ఇరవై రోజులుగా ఆయా రోడ్ల నిర్మాణ పనులు సాగుతున్నాయి. గణపవరానికి ఇటీవల మంజూరు చేసిన విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు పురోగతిని ముఖ్యమంత్రికి వివరించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గంలో అత్యవసరమైన ఉంగుటూరు, పూళ్ల, గణపవరం వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరినట్లు ఎమ్మెల్యే వాసుబాబు తెలిపారు.

పరిమళించిన మానవత్వం

- జిల్లాలను దాటి సేవలందిస్తున్న వలంటీర్లు
- సొంత సొమ్ముతో వందల కి.మీ. ప్రయాణించి పెన్షన్ సొమ్ము చెల్లింపు



విశాఖలో పెన్షన్ అందిస్తున్న గోపాలపురం వలంటీర్ దుర్గలక్ష్మి



విజయవాడ వెళ్లి పెన్షన్ అందిస్తున్న వలంటీర్ అంజలి

ఉంగుటూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ అందిస్తున్న సేవలు మానవత్వ పరిమళాలను వెదజల్లుతున్నాయి. అనారోగ్యంతో దూరప్రాంతాల్లో లేక ఆస్పత్రుల్లో వైద్యం పొందుతున్న లబ్ధిదారుల వద్దకే వలంటీర్లు సొంత ఖర్చులతో ప్రయాణించి వెళ్లి మరీ పింఛన్ సొమ్ము అందజేస్తూ భళా అనిపించుకుంటున్నారు. వలంటీర్లు స్వచ్ఛందంగా అందిస్తున్న సేవలపై సర్వత్రా ప్రశంసల జల్లు కురుస్తోంది.

గోపాలపురం నుంచి విశాఖ వెళ్లి..

మానసిక స్థితి బాగోక విశాఖపట్టణంలో చికిత్స చేయించుకుంటున్న ఓ వృద్ధురాలి వద్దకు వెళ్లి పెన్షన్ సొమ్ము అందించడంతో కుటుంబ సభ్యులు సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని గోపాలపురానికి చెందిన దెయ్యాల సుబ్బలక్ష్మి అనే వృద్ధురాలు మానసిక సమస్యతో బాధపడుతోంది. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను విశాఖపట్టణంలోని మానసిక ఆస్పత్రిలో చికిత్స కోసం చేర్పించారు. సమాచారం తెలుసుకున్న గోపాలపురం వలంటీర్ ఇల్లెందుల దుర్గ సోమవారం విశాఖపట్టణం వెళ్లి సుబ్బలక్ష్మి వేలిముద్రలు తీసుకుని పెన్షన్ సొమ్ము అందించింది. వలంటీర్ సుమారుగా 300 కి.మీ ప్రయాణించి పెన్షన్ అందించడంపై పలువురు వలంటీర్ సేవలను అభినందించారు.

విజయవాడ వెళ్లి పెన్షన్ అందజేత

దెందులూరు: మండలంలోని చల్లచింతలపూడి గ్రామానికి చెందిన మోదుగుమూడి శ్రీమన్నారాయణ అనారోగ్యంతో విజయవాడ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. సోమవారం గ్రామానికి చెందిన వలంటీర్ అంజలి విజయవాడ వైద్యశాలకు వెళ్ళిపెన్షన్ నగదును అందచేశారు. వలంటీర్ అంజలి విజయవాడ వెళ్ళి పెన్షన్ నగదు అందచేయడం పట్ల గ్రామసర్పంచ్ బైగాని వెంకటేశ్వరమ్మ శ్రీమన్నారాయణ అభినందించారు.

తహసీల్దార్లు, ఎంపీడీవోలు బాధ్యతల స్వీకరణ

భీమడోలు: భీమడోలు తహసీల్దార్‌గా జి.వరహాలయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల నేపథ్యంలో కాకినాడ ఆర్‌డీవో కార్యాలయం ఏవోగా పని చేస్తూ బదిలీపై భీమడోలు తహసీల్దార్‌గా నియమించారు. ఈ తరుణంలో ఆయన భీమడోలు తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈయన కొవ్వూరు, మైలవరం, గుడివాడ తహసీల్దార్‌గా పని చేసారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని కాకినాడ ఆర్‌డీవో ఏవోగా పని చేస్తున్న ఆయనను భీమడోలుకు బదిలీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలను తమ సిబ్బంది సహాయ సహకారాలతో నిష్పక్షపాతంగా నిర్వహిస్తానన్నారు. కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్ఏలు ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందించి అభినందించారు. అనంతరం ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసి ఏలూరు కలెక్టరేట్‌కు బదిలీపై వెళ్లిన ఎం.ఇందిరాగాంధీని వీఆర్వోలు, వీఆర్ఏ, కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీటీ షంషుద్దీన్, సీఎస్ డీటీ మాధవరావు, సర్వేయర్ ధర్మారావు, ఆర్ఐ కిరణ్మయి, వీఆర్వోల అసోసియేషన్ అధ్యక్షుడు కందులపాటి శంకర్, వీఆర్వోలు వినయ్, ఇంతియాఫ్, డి.సింహాచలం, సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

దెందులూరు తహసీల్దార్‌గా జితేంద్ర

దెందులూరు: దెందులూరు మండల నూతన తహసీల్దార్‌గా వీ.జితేంద్ర సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు డిప్యూటీ తహసీల్దార్ ప్రియదర్శిని, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఏవీ నాగేశ్వరరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హేమ, అన్ని గ్రామాల వీఆర్‌ఓలు, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు. తహసీల్దార్ జితేంద్ర తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురం నుంచి బదిలీపై వచ్చారు.

తహసీల్దార్ నాంచారయ్యకు ఘన సత్కారం

దెందులూరు: దెందులూరు తహసీల్దార్‌గా విశేష సేవలందించిన ఎస్‌వీ నాంచారయ్య డిప్యూటీ కలెక్టర్‌గా ఏలూరు జిల్లాకు రావాలని డిప్యూటీ తహసీల్దార్ ప్రియదర్శిని, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ నాగేశ్వరరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హేమ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రియదర్శిని ఆధ్వర్యంలో బదిలీపై వెళ్తున్న నాంచారయ్యకు వీఆర్‌ఓలు, అన్ని గ్రామాల సర్వేయర్లు, రేషన్ డీలర్లు, వీఆర్‌ఏలు, రేషన్‌వాహనాల డ్రైవర్లు ఘనంగా సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఓలు కిషోర్, రామారావు, శ్రీనివాస్, అనిరుధ్, రామకృష్ణ, శ్రీనివాసరావు మాట్లాడుతూ తహసీల్దార్ నాంచారయ్య సేవలను కొనియాడారు. సన్మాన గ్రహీత నాంచారయ్య మాట్లాడుతూ విధి నిర్వహణలో దెందులూరు మండలంలో తనకు అందరూ సహకరించారని, ఉన్నతాధికారులు ప్రోత్సహించారని అన్నారు.

ఉంగుటూరు ఎంపీడీవోగా శర్మ బాధ్యతల స్వీకరణ

ఉంగుటూరు: ఉంగుటూరు ఎంపీడీవోగా డీఎల్‌ఎస్ శర్మ సోమవారం బాధ్యతలు చేపట్టారు. తూర్పుగోదావరి జిల్లా గొల్లప్రోలు ఎంపీడీవోగా ఆయన పనిచేసి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఆఫీసు సూపరింటెండెంటు ఆంజనేయబాబు, సీనియర్ సహాయకుడు ఫణీ ఆయనకు స్వాగతం పలికారు. పలువురు ఎంపీటీసీ సభ్యులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.

భీమడోలు ఎంపీడీవోగా స్వర్ణలత

భీమడోలు: భీమడోలు ఎంపీడీవోగా టి.స్వర్ణలత సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల నేపథ్యంలో ఎంపీడీవోల బదిలీల్లో భాగంగా కృష్ణాజిల్లా తోట్లవల్లూరు ఎంపీడీవోగా పని చేస్తున్న తుంగల స్వర్ణలతను భీమడోలు మండలానికి నియమించారు. ఈ నేపథ్యంలో ఆమె తన పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పని చేసిన సీహెచ్ పద్మావతిదేవి కృష్ణాజిల్లా ముసునూరు మండలం ఎంపీడీవోగా బదిలీ అయ్యారు. నూతన ఎంపీడీవోను కార్యాలయ సిబ్బంది, గ్రామకార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు.

నిడమర్రు తాహసీల్దారుగా పోసిబాబు

నిడమర్రు: నిడమర్రు తాహసీల్దారుగా కె. పోసిబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇప్పటి వరకూ తూర్పుగోదారి జిల్లా బిక్కవోలు మండల తాహసీల్దారుగా విధులు నిర్వహించి బదిలీపై నిడమర్రు మండలం వచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దారు కార్యాలయం సిబ్బంది డీటీ శేఖర్, ఆర్ఐ సుబ్బారావు, వీఆర్వో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జి. సాయి తదితరులు ఉన్నారు.

పెదపాడు తహసీల్దార్‌గా భావన్నారాయణ

పెదపాడు: పెదపాడు తహసీల్దార్‌గా భావన్నారాయణ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. నందివాడ నుంచి బదిలపై ఆయన పెదపాడు వచ్చారు. ఇంతకుముందు తహసీల్దార్‌గా పనిచేసిన జీ విజయకుమార్‌రాజు నందివాడ తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. మండలంలోని వీఆర్వోలంతా మర్యాదపూర్వకంగా తహసీల్దార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పింఛను అందజేత

గణపవరం: అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న పింఛనుదారుకు వలంటీరు ఏలూరు ఆస్పత్రికి వెళ్లి పింఛను అందించారు. గణపవరం మండలం అర్ధవరానికి చెందిన పిల్లి సరోజని ఇటీవల ఏలూరు ఆశ్రం ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించుకుని అక్కడే చికిత్స పొందుతున్నారు. ఈవిషయం తెలిసిన వలంటీరు సావిత్రి, ఎంపీటీసీ అల్లాడి రమేష్ సహకారంతో ఏలూరు ఆస్పత్రికి వెళ్లి పింఛను సొమ్ము రూ.3వేలు అందజేశారు. సరోజనికి సొమ్ము అవసరం ఉంటుందన్న ఉద్దేశ్యంతో పింఛను అందజేసినట్లు రమేష్ తెలిపారు.